# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఇటీవల జరిగిన పలు జాతీయ స్థాయి పరీక్షల్లో విజయం సాధించిన సాంఘిక సంక్షేమ పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.
- రాష్ట్రంలోని 9 జిల్లాలలో ఈరోజు స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రారంభమయ్యింది.
- రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి కె అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- విశాఖపట్నంలోని ఈస్టర్న్ నావల్ కమాండ్ ప్రధాన కేంద్రంలో “ఉదయగిరి, హిమగిరి” అనే రెండు యుద్ధ నౌకలు రేపు భారత నావికాదళంలోకి ప్రవేశించనున్నాయి.

==========================

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ సంవత్సరం ఐఐటీ, ఎన్ఐటి, నీట్ వంటి అర్హత పరీక్షల్లో విజయం సాధించిన 55 మంది విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఆ విద్యార్థులు ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విద్యార్థులతో మాట్లాడుతూ... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్ ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు.. రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

==========================

రాష్ట్రంలోని 9 జిల్లాలలో ఈరోజు స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రారంభమయ్యింది. సెప్టెంబర్ 15 నాటికి అన్ని జిల్లాలలో మొత్తం కోటి 46 లక్షల కుటుంబాలకు కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని పోరంకి బి.జే.ఆర్. నగర్‌లో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్ళి స్మార్ట్ రైస్ కార్డులను ఈరోజు మంత్రి పంపిణీ చేశారు. చౌక ధరల దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులను పొందేందుకు ఈ స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. 2025 ఖరీఫ్ సీజన్ కు అవసరమయ్యే ఎరువుల లభ్యత, సరఫరా, నిల్వలు మొదలగు అంశాలపై మంత్రి అచ్చెన్నాయుడు వివరణ ఇస్తూ.. ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు 31.15 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేయగా, ఇప్పటి వరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి చేరాయని తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచిందని మంత్రి వెల్లడించారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా అందులో 75 వేల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 90 వేల మెట్రిక్ టన్నులు వివిధ పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

==========================

వినాయక చవితి సందర్భంగా ఉత్సవాలు జరిగే రోజుల్లో మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని తన దృష్టికి తీసుకువచ్చిన వినతిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో చర్చించానని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా విడుదల చేయనుందని వెల్లడించారు. రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గా పందిళ్లకు కూడా ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. వినాయక చవితి, దసరా ఉత్సవాల ఉచిత విద్యుత్ కోసం 25 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేయనుందని తెలిపారు.

విరామం

==========================

ఆధునిక యుద్ధ అవసరాల దృష్ట్యా స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఉదయగిరి (F-35), హిమగిరి (F-34) అనే రెండు యుద్ధ నౌకలు భారత నావికాదళంలోకి ప్రవేశించనున్నాయి. ప్రాజెక్ట్ 17A కింద నిర్మించబడ్డ ఈ ఆధునిక స్టెల్త్ ఫ్రిగేట్‌లు రేపు విశాఖపట్నంలోని ఈస్టర్న్ నావల్ కమాండ్ ప్రధాన కేంద్రంలో జలప్రవేశం చేయనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ హాజరు కానున్నారు. ముంబైకి చెందిన మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ ఉదయగిరిని నిర్మించగా.. హిమగిరిని కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ & ఇంజినీర్స్ నిర్మించింది.

==========================

పర్యాటక పరంగా కోనసీమ మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరముందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. అమలాపురంలో చాయ్ పే చర్చ, కార్యకర్తల సమావేశంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ప్రతీ ఒక్కరూ అడుగులు వేయాలని, స్వదేశీ వస్తువుల కొనుగోలు పెరగాలన్నారు. కేరళ తరహాలో కోనసీమ ప్రాంతంలోనూ అభివృద్ధి జరిగేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

=========================

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు గోదావరి నీటిని సరఫరా చేస్తామని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈరోజు ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ నాగరాణితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడుసార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి 16 సమీక్షలు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 80 శాతం హామీలను నెరవేర్చి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తోందన్నారు. ఏటీఎం కార్డు మాదిరిగా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు అందిస్తున్నామన్నామని.. ఈ కార్డ్ ద్వారా ఇక ఏ ప్రాంతంలోనైనా రేషన్ సరుకులు పొందవచ్చని మంత్రి స్పష్టం చేశారు.

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=========================

వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 5.8 కిలోమీటర్ల మధ్య కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది ఎత్తుకు వెళ్ళేకొలది దక్షిణం వైపుకు వంగి రాబోయే 48 గంటల్లో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులకు వాతావరణ సూచనలను మెట్రాలజిస్ట్ ఎం.వెంకట్రావు తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

=========================

జార్ఖండ్ లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు, మూడు, నాలుగు స్థానాలు సాధించిన కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులను కలెక్టర్ పి. రంజిత్ బాషా అభినందించారు. కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఈరోజు జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడల్లో సాధించిన విజయాలు జిల్లాకు గౌరవం తీసుకొస్తాయన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ అద్భుతంగా రాణించాలని విద్యార్థులకు సూచించారు.

=========================

=========================